క్లుప్తంగా

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న ఎంపీడీవో రామచందర్

లింగాపూర్: అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఎంపీడీవో రామచందర్ అన్నారు. సోమవారం రైతువేదికలో నిర్వహించిన సమావేశంలో 14 గ్రామ పంచాయతీల ఇందిరమ్మ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించారు. నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరయ్యాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రజనీకాంత్, పంచాయతీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

దహెగాం: మండల కేంద్రంలోని ముత్యంపేట ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ రోజుల్లో విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగం సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుప్రియ, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఎంపిక

లింగాపూర్: మండలంలోని పిక్లాతండా గ్రామానికి చెందిన బానోత్ హరినాయక్, భారతిబాయి కుమారుడు అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. ఆదివారం విడుదల అయిన ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అగ్నివీర్‌కు ఎంపికయ్యాడు. దీంతో గ్రామస్తులు, కుటుంబసభ్యులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెంచికల్‌పేట్: ఎల్కపల్లి సబ్‌స్టేషన్‌లో మరమత్తుల దృష్ట్యా మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పెంచికల్‌పేట్ ఏఈ అంజల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో జరిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సన్మానిస్తున్న టీచర్లు

కెరమెరి: మండలంలోని గోయగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు పసుపుల ప్రవీణ్, జైవంతాలను సోమవారం గోయగాం టీచర్లు ఘనంగా సత్కరించారు. శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఎంఈవో ఆడే ప్రకాశ్ మాట్లాడుతూ.. అంకితభవంతో విధులు నిర్వర్తించి, విద్యార్థుల విద్యాభివృద్ధికి అహర్నిషలు చేసిన కృషి అభినందనీయమన్నారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపడమే ఉపాధ్యాయుల ధర్మమన్నారు. కార్యక్రమంంలో ఉపాధ్యాయులు నల్లగొండ రమేశ్, భరత్‌రావు, శ్రీనివాస్, విష్ణు, అర్చనాదేవి, శ్యామల, రవితేజ పాల్గొన్నారు.

రేపు 'భూభారతి'పై అవగాహన

చింతలమానెపల్లి: మండలంలోని బాలాజీ అనుకోడ రైతువేదికలో ఈనెల 23న భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మునావర్ షరీఫ్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ప్రారంభమౌతుందన్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్‌లు హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

24న భూభారతిపై అవగాహన

కెరమెరి: మండలంలోని కెస్లాగూడ రైతువేదికలో ఈనెల 24న ఉదయం 10 గంటలకు భూభారతి చట్టంపై అవగాహన నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దత్తుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, ప్రజలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'ఉపాధి'లో టాప్..!



తిర్యాణిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- లక్ష్యానికి మించి కూలీలకు పనిదినాలు
- ఇప్పటికే రూ 8.48 కోట్లు చెల్లింపులు
- రోజుకు 3,500 మందికిపైగా ఉపాధికూలీల హాజరు

తిర్యాణి: గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని చేపడుతుంది. ఈ పథకంలో భాగంగా వీలైనంత ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధి అధికారులు, సిబ్బంది పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూలీలకు లక్ష్యానికి మించి పనిదినాలను కల్పించడంతో ఉపాధి కల్పనలో తిర్యాణి మండలం జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. పంట పొలాల చదును, నీటి కుంటలు, చేపల కుంటాల తవ్వకం, పంట పొలాలకు రోడ్లు వేయడం, ఇంకుడు గుంతల తవ్వకం, నర్సరీలల్లో మొక్కల పెంపకం లాంటి పనులను చేపడుతున్నారు.

3 లక్షల 92 వేల పని దినాలు..

మండలంలో 29 గ్రామ పంచాయతీలుండగా.. ఉపాధిహామీ పథకానికి సంబంధించిన జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాల సంఖ్య 7,594గా ఉంది. కాగా.. అందులో ప్రస్తుతం 5,498 జాబ్‌కార్డులు యాక్టీవ్‌లో ఉన్నాయి జాబ్‌జార్డు పరిధిలో 9,837 మంది కూలీలు ఉపాధి పనులు చేపడుతున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2.51 లక్షల పని దినాలను కల్పించాలని టార్గెట్ పెట్టుకోగా లక్ష్యానికి మించి మొత్తంగా 3.92 లక్షల పనిదినాలను కల్పించారు. ఇందుకోసం వేతనాల రూపంలో కూలీలకు 8.48 కోట్లను ఖర్చు చేశారు. మండలంలో 952 కుటుంబాలకు వంద రోజుల పని దినాలు కల్పించారు.

జోరుగా పనులు..

2025- 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 3.20 లక్షల పని దినాలు కల్పించాలనే లక్ష్యం పెట్టుకొగా అందుకు సంబంధించిన ప్రణాళికలను సైతం సిద్ధం చేశారు. కాగా ప్రస్తుతం వ్యవసాయ సంబంధిత పనులు లేకపోవడంతో రైతు కూలీలు ఉపాధి పనులపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం మండలంలో రోజు వారీగా 3,500 మందికి పైగా కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచే ఉపాధి పనులు జోరుగా సాగుతుండడంతో ఈ ఏడాది సైతం లక్ష్యానికి మించి ఉపాధి పని దినాల కల్పించే అవకాశం లేకపోలేదు.

మండలానికి మొదటి స్థానం

ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని 9,837 మంది కూలీలకు 3.92 లక్షల పని దినాలను కల్పించి 8.48 కోట్ల వేతనాలను చెల్లింపు చేశాం. జిల్లాలో కూలీల పని దినాల కల్పించడంలో మండలానికి మొదటి స్థానం దక్కింది.

– షాకీర్ ఉస్మాని, ఈజీఎస్ ఏపీవో, తిర్యాణి

'జుబ్లీ'లోనే కూరగాయల విక్రయాలు కొనసాగాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కూరగాయల వ్యాపారులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాజంపేట జుబ్లీ మార్కెట్‌లోనే కూరగాయల విక్రయాలు కొనసాగించాలని, పట్టణంలో ఇష్టారీతిన విక్రయాలు చేపట్టొద్దని కూరగాయల వ్యాపారులు డిమాండ్ చేశారు. జుబ్లీ మార్కెట్‌లోనే కూరగాయల విక్రయాలు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మార్కెట్ బంద్ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా జుబ్లీ మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు సజావుగా కొనసాగుతున్నాయని, ఇటీవల కొందరు వ్యాపారులు పట్టణంలోని రోడ్లపై విక్రయాలు జరుపుతున్నారని తెలిపారు. దీంతో వ్యాపారాలు కుంటుబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని హంగులతో నిర్మించిన జుబ్లీలోనే విక్రయాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో లోకేశ్వర్‌రావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గణేశ్, కృష్ణ, రాము, సంతోష్, కవిత, స్వరూప, శాంతక్క, సాయికృష్ణ, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

జుబ్లీలోనే కూరగాయల మార్కెట్ కొనసాగించాలి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన జుబ్లీ మార్కెట్‌లోనే కూరగాయల మార్కెట్ కొనసాగించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని వివేకానందచౌక్, గాంధీ చౌక్‌లో కొంతమంది చిరువ్యాపారులు కూరగాయలు విక్రయిస్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గతంలో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో రూ.2 కోట్లతో జుబ్లీ మార్కెట్‌ను నిర్మించినట్లు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ భూమిలో కొంత మంది అక్రమంగా టేలాలు ఏర్పాటు చేసుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ప్రత్యేకాధికారి దీనిపై చొరవ తీసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఇంద్రవెల్లి: గర్భిణులు ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐడీఎస్ సూపర్‌వైజర్ వందన అన్నారు. సోమవారం మండలంలోని దనోరా(బి) పరిధిలోని జనతగూడ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ అభియాన్ పక్షం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులతో పాటు బాలింతలు, పిల్లల సంరక్షణ, ఎస్ఆర్‌సీ రేఫరల్‌పై తల్లులకు అవగాహన కల్పించారు. ప్రతీ రోజు అన్ని రకాల పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కమలబాయి, అభియాన్ కోఆర్డినేటర్ పురుషోత్తం, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో విద్య సులభతరం



ఏఐ విద్యను పరిశీలిస్తున్న ఎంఈవో

కెరమెరి: ఏఐ (కృత్రిమ విద్యాబోధన)తో విద్య మరింత సులభతరం అయిందని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. సోమవారం మండలంలోని గోయగాం ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నేర్చుకుంటున్న ఏఐ విద్యను ఆయన పరిశీలించారు. గడిచిన నెలరోజులుగా ఏమి నేర్చుకున్నారో అడిగి తెలుసుకున్నారు. తెలుగు, గణితం పాఠాలను ఏఐ మాధ్యమం ద్వారా చదివించారు.

ప్రయాణికుల పాట్లు



పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని ఎల్కపల్లి బస్‌స్టేషన్ ఏరియాలో నూతన సీసీ రోడ్డు నిర్మించేందుకు గత పదిహేను రోజులుగా బస్టాండ్‌ను తాత్కాలికంగా మూసివేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన బస్టాండ్ తెరవలేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. చిన్న పిల్లలతో బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు స్పందించి మూసివేసిన బస్టాండ్ తెరవాలని ప్రజలు కోరుతున్నారు. - పెంచికల్‌పేట్

మతిస్థిమితం లేని మహిళను కుటుంబసభ్యులకు అప్పగింత

సిర్పూర్(టి): సిర్పూర్(టి)– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై నుంచి వెళ్తున్న మహిళ వస్తుండటాన్ని గుర్తించిన మహిళ కానిస్టేబుల్ మార్గమధ్యలో ఆపి వివరాలు తెలుసుకున్నారు. మతిస్థిమితంలేని మహిళగా గుర్తించి నూతన వస్త్రాలు అందించి సిర్పూర్(టి) పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహిళ వివరాలు సేకరించి కుటంబసభ్యులకు సమాచారం అందించి అప్పగించారు. కానిస్టేబుల్‌ను ఎస్సై కమలాకర్, సిబ్బంది అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తిర్యాణి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు అయిన సంఘటన మండలంలోని గిన్నెదరి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గిన్నెదరి గ్రామం నుంచి కోర్లంక గ్రామం వైపు వెళ్తున్న గుర్తు బైక్ వృద్ధురాలిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా.. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌లో మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

లింగాపూర్‌కు ఆర్టీసీ సేవలు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



మండల కేంద్రంలో బస్సు ఎక్కుతున్న మహిళలు

లింగాపూర్: మండలానికి బస్సు సౌకర్యం లేక మహిళలు ఉచిత ప్రయాణానికి దూ రమవుతున్న తీరుపై సాక్షి దినపత్రికలో ఈ నెల 17న కానరాని ఆర్టీసీ సేవలు అనే కథనం ప్రచురితమైంది. దీనిపై ఆర్టీసీ అధికారులు స్పందించారు. సోమవారం ఆసిఫాబాద్ నుంచి లింగాపూర్ మండల కేంద్రానికి పల్లెవెలు గు బస్సు సర్వీసును ప్రారంభించారు. మండ ల కేంద్రానికి బస్సు నడపడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వెదురు మొక్కలు నాటండి



మహిళలతో మాట్లాడుతున్న సీఆర్‌పీలు

కెరమెరి: 15 గుంటల స్థలం ఉన్న మహిళలందరూ తమ పొలాల్లో వెదురు మొక్కలు నాటాలని సీఆర్‌పీలు క్రిష్ణవేణి, ప్రీతి అన్నారు. సోమవారం మండలంలోని రావుజీగూడ గ్రామంలో వీవో సంఘ మహిళలతో మాట్లాడారు. రానున్న రోజుల్లో వెదురు అధిక డిమాండ్ ఉంటుందని, అందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఆసక్తి ఉన్న మహిళా రైతులకు 60 మొక్కలు, ఉచితంగా విత్తనాలు, సేంద్రియ ఎరువులు అందిస్తామన్నారు. వారి వెంట సీసీలు సుజాత, కౌసల్య, వీవోఏ శ్రీధర్ ఉన్నారు.

గోయగాంలో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్



అవగాహన కల్పిస్తున్న నల్లగొండ రమేశ్

కెరమెరి: మండలంలోని గోయగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంప్లెక్స్ లోని ఇందాపూర్, సుర్దాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 6, 7వ తరగతుల విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై పలు విషయాపై అవగాహన పొందారు. హైస్కూల్‌లో తరగతి గదులతో పాటు కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ విద్యా, సైన్స్ గణితం, క్రీడా పరికరాలు, ఆటలు ఆడుకునేందుకు విశాలమైన ప్రాంగణం, ప్రత్యేక మరుగుదొడ్లు, తాగునీటి వసతి, నాణ్యమైన భోజనంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ట్విన్నింగ్ స్కూల్ పేరుతో ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆడే ప్రకాశ్, ఇందాపూర్, సుర్దాపూర్ హెచ్ఎం సరోజా, సురేశ్, గోయగాం ఉపాధ్యాయులు రమేశ్, భరత్, ప్రవీణ్, జైవంత పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



టోర్నీ ప్రారంభిస్తున్న నాయకులు

కౌటాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ మండల కన్వీనర్ నికోడే గంగారాం అన్నారు. సోమవారం మండలంలోని కోయగూడ గ్రామంలో నిర్వహిస్తున్న ఆదివాసీ జీపీ లెవల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆటల్లో రాణించాలన్నారు. క్రీడ స్ఫూర్తితో ఆటలు ఆడాలని, క్రీడలతో మానసికోల్లాసం, స్నేహభావం పెరుగుతుందన్నారు. మొదటి బహుమతి రూ. 30 వేలు, ద్వితీయ బహుమతి రూ. 20 వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇరిగిరాల భాస్కర్, ఆర్ భీంరావు, మడే ధర్మయ్య, తలండి హన్మంతు, కోటేశ్వర్, రాజు, రవి, తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని జిల్లా నాయకులు నక్క శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వారసంతలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈనెల 27న వరంగల్‌లో భారీ బహిరంగ సభ ఉంటుందని, సభకు మాజీ సీఎం కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బండు, కార్తీక్, నవీన్, మోతిరాం, భారత్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

సంతలో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

కౌటాల: కౌటాల వారసంతలో సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కుంచాల విజయ్ మాట్లాడుతూ జిల్లాలో ఎండలు మండుతున్నాయని, ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వేసవి కాలం ముగిసే వరకు ప్రతీ సోమవారం కౌటాలలో మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బూర్ల రవి, మధుకర్, తిరుపతి, భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబలి పంపిణీ ప్రారంభం

రెబ్బెన: మండలంలోని ఇందిరనగర్ గ్రామంలోని స్వయంభూ మహాకాళీ దేవస్థాన ప్రధాన అర్చకులు దేవార వినోద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అంబలి పంణిణీ కేంద్రంను తహసీల్దార్ రామ్మోహన్, ఎస్సై చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని అంబలి పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తిరుపతి గౌడ్, మాజీ సర్పంచ్ అహల్య దేవి, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోశ్ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

తిర్యాణి: మండలంలోని ఎదులపహాడ్ గ్రామంతో పాటు ఆయా గ్రామాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. గాలివానకు ఎదులపహాడ్ గ్రామానికి చెందిన మడావి చిరంజీవికి ఇంటి ఎదుట చెట్టు విరిగిపడటంతో ఇళ్లు ధ్వంసమైంది. అలాగే విద్యుత్ స్తంభాలు గాలికి నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

రెబ్బెన: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ పాటించాలని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్వీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు.

ఎండ నుంచి ఉపశమనం



రోజురోజుకూ ఎండలు దంచి కొట్టడంతో మనుషులే కాకుండా పశువులు అల్లాడుతున్నాయి. దీంతో పశువులు కాస్త చెట్టు నీడ కనిపించిన సేద తీరుతున్నాయి. లింగాపూర్ శివారులో మామిడి చెట్ల కింద నీడకి చేరి ఉపశమనం పొందుతున్నాయి. - లింగాపూర్